‘ఉపాధి’లో మహిళలే అధికం

- గ్రామాల్లో జోరుగా పనులు
- పేదలకు ఆసరాగా ఉపాధి హామీ
- సద్వినియోగం చేసుకుంటున్న పేదలు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సుజాతనగర్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆసరాగా నిలుస్తోంది. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఆదుకుంటోంది. అడిగిందే తడవుగా అధికారులు కూలీలకు జాబ్ కార్డులను జారీ చేస్తూ పని కల్పిస్తున్నారు. రెండు నెలలుగా సుజాతనగర్ మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఉపాధి పనులు చేసేందుకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు అధికారులు జాబ్‌కార్డులు అందజేస్తూ పనులు కల్పిస్తున్నారు. మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో మహిళా కూలీలు అధికంగా పాల్గొంటున్నారు. పురుషులు వ్యవసాయం, ఇతరత్రా పనులు చేస్తుండగా మహిళలకు ఉపాధి హామీ పనులు వరంగా మారాయి. వేసవిలో వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో మహిళా కూలీలు అధిక సంఖ్యలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్త్రీ, పురుషులనే బేధం లేకుండా పనిదినాలు కల్పిస్తుండటంతో పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో పనులు చేస్తున్నారు.

గ్రామాల్లో జోరుగా ఉపాధి హామీ పనులు...

రెండు నెలలుగా మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులను చేపడుతున్నారు. సుజాతనగర్ మండలంలో గత సంవత్సరంలో 10,165 జాబ్‌కార్డులు ఉండగా ఈ సంవత్సరం 10,415కు పెరిగాయి. మండలంలో రోజు వారీగా నాలుగు వేల మంది కూలీలు పనిచేస్తున్నారు. ఈ సంవత్సరం చెరువుల్లో పూడికతీత, చెక్‌డ్యాంల్లో పూడికతీత, చిన్న, పెద్ద కుంటల్లో పూడికతీత, చేపల చెరువుల్లో పూడికతీత, కాల్వల్లో పూడికతీత, నర్సరీల్లో మొక్కల పెంపకం, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, పండ్ల మొక్కల పెంపకం, పొలాల్లో గట్ల నిర్మాణం తదితర పనులను ఉపాధి హామీ ద్వారా చేపడుతున్నారు. ఉదయం 7 గంటల వరకే ఇంటి వద్ద పనులు ముగించుకుని ఉపాధి హామీ పనులకు తరలి వెళ్తున్నారు. మండలంలో 10,415 జాబ్ కార్డులుండగా సుమారు 21,918 మంది కూలీలున్నారు. ఇందులో 13 వేల మంది మహిళలు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఒక లక్షా ఎనభై వేల పనిదినాలు కల్పించారు. మండలంలో రూ.2 కోట్ల అంచనాలతో ఉపాధి పనులు చేపడుతుండగా... ఈ సంవత్సరం రెండు నెలల్లో రూ.కోటి మేర పనులు చేపట్టారు.

కుటుంబ అవసరాలకు ఉపయోగం..



ఇటీవల ప్రభుత్వం ఈజీఎస్ కూలీ రూ.300కు పెంచింది. ఉపాధి పనులపై సంపాదించే మొత్తంలో కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోంది. కొంత మొత్తం పొదుపు చేస్తున్నాను. ఉదయమే పనికి వెళ్లి ఎండకాకముందే ఇంటికి వస్తున్నాం.

– అత్తునూరి సీతమ్మ, గొల్లగూడెం

కలిసి పనిచేస్తుంటే అలసట ఉండదు..



మహిళలందరూ కలిసి పనిచేస్తుంటే అలసట కనిపించదు. ఒకే పనిని వందలాది మహిళలు చేపట్టడంతో పనులు త్వరగా పూర్తవుతున్నాయి. మండుతున్న ఎండలతో కొంత కష్టంగా ఉన్నా కూలీ పెంచడంతో ఆనందంగా పనిచేస్తున్నాం.

– పోతురాజు లక్ష్మి, గొల్లగూడెం

సద్వినియోగం చేసుకుంటున్నారు



ఉపాధి హామీ పనుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో పనులు వేగంగా పనులు జరుగుతున్నాయి. పనుల్లో మహిళలే అధికంగా హాజరవుతున్నారు. పనులను లక్ష్యం మేరకు పూర్తి చేస్తున్నారు.

– టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ

క్లుప్తంగా

నేడు పట్టభద్రులతో కేటీఆర్ సమావేశం


మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం పట్టభద్రులతో సమావేశం అవుతారని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాగొంతుక వినిపించే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాపు సీతాలక్ష్మి, దామోదర్ యాదవ్, బాదావత్ శాంతి, భూక్యా సోన, కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకుడు

కొత్తగూడెంఅర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఫ్రెండ్స్ ఫౌండేషన్, ఎంకేఏ సోషల్ మీడియా ఇన్ఫర్మేషన్ ఆధ్వర్యంలో సంకల్ప వాలంటరీ ఆర్గనైజేషన్ సహకారంతో ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు చెక్కా శ్రీకాంత్, బి.గౌతం, పి.అనిత మాట్లాడుతూ.. తలసేమియా జన్యుపరమైన రక్త రుగ్మత వ్యాధి అని సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకరంగా మారుతుందన్నారు. జిల్లాలో సుమారు 600మంది తలసేమియా వ్యాధిలో బాధపడుతున్నారని, వారందరికీ ఇరవై నుంచి నెల రోజుల లోపు రక్తం అవసరమవుతోందని, వారందరి ప్రాణాలు నిలవాలంటే రక్తం ఎంతో అవసరమని తెలిపారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో అనేక మంది యువకులు స్వచ్ఛందంగా తరలిరావడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసినవారికి సంస్థ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.సత్యసాయి, కె.చరణ్, బి.సైదులు, పి.రవిచందర్, ఎ.సుధీర్, బి.ఉదయయ్ కిరణ్, జె.జెశ్వంత్, కె.శివకుమార్, టి.నందిత్, మహేష్, చంటేశ్వర్, ఇ.కౌషిక్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


బోనాలతో వస్తున్న మహిళలు

టేకులపల్లి: బద్దుతండా గ్రామంలో నాభిశిల, శీత్లా పరమేశ్వరి, ముక్తేశ్వరి ముత్యాలమ్మ తల్లి, రణ పోతురాజు గ్రామ దేవతలు, బొడ్రాయి మూడో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం గ్రామపెద్దలు, వేడుకల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాచార్యులు శ్రీరంగం అజయ్ సాయిచక్రి శర్మ చేత ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దంపతులు హోమం పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి ముత్యాలమ్మ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి


వాసవీ మాతకు పూజలు చేస్తున్న భక్తులు

పాల్వంచ: పట్టణంలోని బొల్లేరుగూడెం లలిత కామేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ మాత జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు కుంకుమ పూజలు, అభిషేకాలు, అష్టోత్తరాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెండ్యాల రోజాలక్ష్మి, తాటికొండ సురేశ్, దారా నరసింహారావు, పెండ్యాల సతీశ్, గూడెపు శ్రీనివాస్, గుబ్బ దుర్గ, మాలే రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో భజన


పూజలో పాల్గొన్న మాలధారులు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు హేమ్లా తండాలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం దీక్ష తీసుకున్న భక్తుల ఆధ్వర్యంలో భజన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానికులు బాలాజీ నాయక్, నరసింహారావు, నూనావత్ వేణు, తేజావత్ రమేశ్, సురేశ్, కొండం వెంకన్న, పైడిపల్లి మహేశ్, చిన్న పండు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి


పాల్వంచ: మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర సమస్యలపై శాసన మండలిలో ప్రజాగళం వినిపించే సత్తా ఉన్న తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎన్నికల కొత్తగూడెం నియోజకవర్గ సమన్వయకర్త తుళ్లూరి బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని అల్లూరి సెంటర్ వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌కే సాబీర్‌పాషా, నాగ సీతారాములు, ఎడవల్లి కృష్ణ, మహేశ్ వర్మ, కొండెం వెంకన్న, జలీల్, బద్ది కిశోర్, నూకల రంగారావు, అయితా గంగాధర్, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమావేశాన్ని జయప్రదం చేయండి

ఇల్లెందు: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న పట్టభద్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ పట్టభద్రుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి విద్యాసాగర్, ములుగురి రమేష్ కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన ఆవశ్యకత, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనా విధానం, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల మెరుగు కోసం తీసుకోనున్న విధానాలపై సమావేశంలో నేతలు అవగాహన కల్పిస్తారని చెప్పారు. పట్టభద్రులు ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగి, సింగరేణి కీర్తిని కోలిండియాలో ఇనుమడింపజేసిన సీనియర్ క్రీడాకారుడు పాసం వెంకట సత్యనారాయణ కరుణకుమార్ (73) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలిసిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. కూనంనేని మాట్లాడుతూ.. సింగరేణి కీర్తిని కోలిండియాలో ఇనుమడింపజేసిన క్రీడాకారుల్లో కరుణకుమార్ ఒకరని, ఆయన ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మెంటన్, కబడ్డీ, క్రీడల్లో ప్రతిభ కనబరిచి సింగరేణిలోనే కాకుండా కోలిండియాలో ఎన్నో పతకాలు సాధించినట్లు చెప్పారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో గాంధీపథం గోర్శెమ్, ఏవీ రామారావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పాసినెట్, చందర్ రావు, కోడి వీరన్న, గణేష్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ రమేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పరితపించిన వ్యక్తి నర్సయ్య

తుదిశ్వాస వరకు ప్రజా, కార్మికుల శ్రేయస్సు కోసం పరితపించిన వ్యక్తి బందెల నర్సయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లో బందెల నర్సయ్య సంతాప సభ జరిగింది. ఈ సభకు ఆయన హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా, యూనియన్ లీడర్‌గా అన్నివర్గాలలకు అతీతంగా నేతగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత ఉద్యమించాలన్నారు. ఎస్‌కే సాబీర్‌పాషా, మారుపాక అనిల్, ఏసురత్నం, లక్ష్మణ్, సుధాకర్, వాసిరెడ్డి సీతారామయ్య, కే.రాజ్‌కుమార్, ముత్యాల విశ్వనాథం, కే.సారయ్య, డి.శేషయ్య పాల్గొన్నారు.

23న పెన్షన్ అదాలత్


మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఈ నెల 23న ఉద్యోగులు, మాజీ ఉద్యోగులకు పెన్షన్, సీఎంపీఎఫ్‌కు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 24ఏరియా వైసీఓఏ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ హాజరవుతారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు, కార్మికులు, మాజీ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పు ఇవ్వలేదని షాపు ధ్వంసం


సరుకులను ధ్వంసం చేసిన దృశ్యం

పాల్వంచ: నిత్యావసర సరుకులు అప్పుగా ఇవ్వలేదని షాపులోని వస్తువులు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు అయింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నాగారం కాలనీలో రాధమ్మ షాపుకు ఆదివారం అదే గ్రామానికి చెందిన బానోతు రాము వచ్చి సరుకులు అప్పుగా ఇవ్వమని కోరాడు. అయితే పాత అప్పు తీర్చాలని, లేదంటే సరుకులు ఇవ్వనని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రాము షాపులోని వస్తువులను ధ్వంసం చేసి సరుకులను కింద పడేసి దూషించాడు. దీంతో రాధమ్మ ఫిర్యాదు మేరకు రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో నోటిఫికేషన్ విడుదల చేయాలి

కొత్తగూడెంఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఏర్పాటైన బాసర ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పదో తరగతి ఫలితాలు విడుదలై 20 రోజులు గడిచిందని, మరో 20 రోజుల్లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్నా నేటి వరకు అధికారులు అడ్మిషన్ల ఊసెత్తకపోవటం పలు అనుమానాలు తావిస్తోందని పేర్కొన్నారు.

23న ‘గురుకుల’ కౌన్సెలింగ్

ఇల్లెందురూరల్: గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 23న భద్రాచలం సంక్షేమ గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సుదిమళ్ల గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. 2024–26 విద్యాసంవత్సరానికి కళాశాలలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల జాతర


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వారం రోజులుగా అటు కాంగ్రెస్, ఇటు బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరుపున ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకోసం ప్రధాన పార్టీలు తమదైన శైలిలో ప్రచారం చేపట్టాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40,106 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 22,590 మంది, మహిళలు 17,516 మంది ఉన్నారు. ఇల్లెందులోనే సుమారు నాలుగు వేల మంది వరకు ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకే గెలుపు దక్కాలని పోటీపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 20న ఇల్లెందుకు మాజీ మంత్రి టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అదేరోజు సాయంత్రం తీన్మార్ మల్లన్నలు ఇల్లెందు సభలో పాల్గొని పట్టభద్రులతో ముఖాముఖిగా చర్చించనున్నారు. ఇక ఇల్లెందులో ఆ సభల విజయవంతంగా కోసం అటు బీఆర్‌ఎస్ తరుపున ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఇటు కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యే కోరం కనకయ్య కృషి చేస్తున్నారు. పట్టభద్రులను కూడగట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కనీసం రెండు వేల మందిని సమీకరించాలని నిర్ణయించారు. అధికార కాంగ్రెస్ తరుపున తీన్మార్ మల్లన్న, బీఆర్‌ఎస్ తరుపున ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటీ పడుతున్నారు. ఇక బీజేపీ తరుపున ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు.

రిజర్వేషన్ సాధనకు కృషి చేయాలి

కొత్తగూడెంఅర్బన్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధన కోసం కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కోసం జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ కేబినెట్ మీటింగ్‌లో చర్చించాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న తుళ్లూరి బ్రహ్మయ్య

కొత్తగూడెంరూరల్: చుంచుపల్లి మండలంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ తుళ్లూరి బ్రహ్మయ్య మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం, టీజేఎస్, ఇతర ప్రజా సంఘాలు బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పోటీ చేస్తున్నారని, ఈనెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేయటం జరిగిందన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించిన విధంగానే అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖరరావు, సాబీర్‌పాషా, తూము చౌదరి, ఆళ్ల మురళీ, కోనేరు సత్యనారాయణ, నాగసీతారాములు, నాగేంద్రత్రివేది, తోటదేవి ప్రసన్న, చీకటి కార్తీక్, పాల సత్యనారాయణరెడ్డి,వెంకట్, కనకరాజు, సుందర్‌లాల్ కోరి, వాసిరెడ్డి మురళీ, చింతలపుడి రాజశేఖర్, ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2002-03 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

ఇల్లెందురూరల్: ఇరవై రెండేళ్ల కింద వారంతా విద్యార్థులు.. పదో తరగతి వరకు ఒకేచోట చదివారు. ఆ తరువాత ఉన్నత చదువులకు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటూ.. గురువులను సత్కరానికి సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ సరస్వతి గురుకుల విద్యాలయం వేదికగా నిలిచింది. పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకున్నారు.

ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. పూర్వ విద్యార్థులు మహ్మద్ ముబీన్, గద్దె శ్రీను, కోరివి ప్రవీణ్, కొమరం అశోక్, వై.ప్రవీణ్, చోల్లేటి నాగరాజు, అరుణ, కృష్ణకుమారి, మీనాకుమారి, ఝెట్టి పూర్ణచంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘కార్పొరేట్’పై పోరాటమే సుందరయ్యకు నివాళి


సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న కనకయ్య


ఇల్లెందు: మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్: మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే కామ్రేడ్ సుందరయ్యకు నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకయ్య మాట్లాడుతూ.. సుందరయ్య 1913 మే 1వ తేదీన పుట్టి, 1985 మే 19న మృతి చెందారని, ఆయన్ను చాలామంది అరేబియన్ హార్స్‌గా పిలుస్తారన్నారు. సుందరయ్య తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించారన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకట్, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, డి.వీరన్న, ఎస్ లక్ష్మి, జునుమాల నగేష్, నందిపాటి రమేష్, కే.సమ్మయ్య తదితరులు పాల్గొ న్నారు.

ఇల్లెందు: సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు ఆదివారం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు మధు మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పాటుపడుతూ, తాను నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కట్టుబడిన మహనీయుడు సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నబీ, కృష్ణ, మోహన్ రావు, కిరణ్, లక్ష్మి, మరియా, రాంచందర్, హుస్సేన్, నాగమణి, వైకుంఠం, కోటమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వికసించిన 'మే' పుష్పం..


విరబూసిన మే పుష్పాలు

మే పుష్పాలు చూపరుల మనసును హత్తుకుంటున్నాయి. చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండాలోని న్యాయవాది రమేష్‌నాయక్ ఇంట్లో ఆదివారం మే పుష్పాలు అరుణవర్ణంలో ఆకట్టుకుంటున్నాయి. ప్రతీ ఏడాది మే లో మాత్రమే ఇవి వికసిస్తాయని యాజమాని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మొక్క కాండం నుంచి మే పుష్పాలు విరబూశాయి. స్థానికులు వీటిని తిలకించి మంత్ర ముగ్ధులవుతున్నారు. ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - చుంచుపల్లి